క్లుప్తంగా

పూర్తిస్థాయి ఆయకట్టుకు సాగునీరందిస్తాం



మదనాపురం: సరళసాగర్ జలాశయం ద్వారా పూర్తిస్థాయి ఆయకట్టుకు సాగునీరందిస్తామని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం సరళసాగర్ వద్ద ప్రత్యేక పూజలు చేసి సాగునీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతు సంక్షేమమే లక్ష్యంగా ప్రభు త్వం పనిచేస్తుందన్నారు. రెండు పంటలకు నీళ్లు ఇచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ ప్రశాంత్, వైస్‌చైర్మన్ తిరుపతి రెడ్డి, సమన్వయ కమిటీ మండల అధ్యక్షుడు చుక్క మహేశ్, మార్కెట్ డైరెక్టర్ పావని రెడ్డి, హనుమాన్‌రావు, కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి, శరత్ రెడ్డి, వడ్డే కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శిగా రాము



పాన్‌గల్: సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శిగా మండలంలోని బుసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన సూర్యవంశంరామును ఎన్నుకున్నట్లు బుధవారం ఆయన తెలిపారు. ఈనెల 14, 15వ తేదీల్లో పెబ్బేర్ పట్టణంలో నిర్వహించిన సీఐటీయూ జిల్లా 4వ మహాసభలో నూతన కమిటీని నియమించినట్లు ఆయన పేర్కొన్నారు. తనపై ఎంతో నమ్మకంతో జిల్లా సహాయ కార్యదర్శిగా ఎన్నిక చేసిన రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్మికుల హక్కులకోసం, కార్మిక విధానాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలపై సమీకరించి ఐక్యంగా ఉద్యమిస్తామన్నారు.

విద్యార్థులకు రాత పుస్తకాలు పంపిణీ

వనపర్తి రూరల్: పెబ్బేరు పట్టణంలోని చెంచువాడ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఉచిత రాతపుస్తకాలను బుధవారం బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అక్కి శ్రీనివాస్‌గౌడ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు రాత పుస్తకాలు అందజేయడం చాలా సంతోషమన్నారు. ప్రతిఒక్కరూ ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చదివించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, హెచ్ఎంలు చిన్నరాములు, ఎల్లస్వామి, ఉపాధ్యాయురాలు మాధురి పాల్గొన్నారు.

రుణాలు ఇవ్వాలని బ్యాంక్ ఎదుట నిరసన



అమరచింత: పట్టణంలోని యూనియన్ బ్యాంక్ ఎదుట గోల్డ్ రుణాలను ఇవ్వాలని సీపీఐ ఆధ్వర్యంలో బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ మేరకు పట్టణ కార్యదర్శి అబ్రహం, సహాయ కార్యదర్శి భాస్కర్‌లు మాట్లాడుతూ.. గత నెల రోజుల నుంచి బ్యాంకు మెనేజర్ బంగారు నగలను తాకట్టు పెట్టుకుని రుణాలను ఇవ్వమని ప్రజలు,రైతులు తిరుగుతున్న పట్టించుకోక పోవడం జరుగుతున్నదన్నారు. పంటల సాగు సమయంలో గోల్డ్‌లోన్ కోసం రైతులు యూనియన్ బ్యాంకు చుట్టూ తిరుగుతున్న బ్యాంక్ అధికారులు పట్టించుకోలేక పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బంగారు తాకట్టు పెట్టుకుని ఇవ్వమని అడుగుతున్నా బ్యాంకు మెనేజర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని బ్యాంక్ మెనేజర్‌కు అందించారు. కార్యక్రమంలో ఎర్రన్న, కుతుబ్, సోలు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ల అప్పగింత

ఖిల్లాఘనపురం: మండలంలోని పలు గ్రామాలకు చెందిన వ్యక్తులు పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను బుధవారం ఎస్‌ఐ నరేశ్ బాధితులకు అప్పగించారు. రెండేళ్ల క్రితం మండలంలోని దేవబండతండాకు చెందిన రాహుల్, నేలబండతండాకు చెందిన కాట్రావత్ మల్లేశ్‌ల సెల్‌ఫోన్లను పోగొట్టుకోవడం జరిగిందన్నారు. సెల్‌ఫోన్లను రికవరీ చేసి బుధవారం బాధితులకు అప్పగించామన్నారు. ఫోన్ రికవరి చేసేందుకు కృషిచేసిన క్రైమ్ కానిస్టేబుల్ లింగంను ఎస్సై అభినందించారు.

‘తీన్మార్’ మల్లన్న కార్యాలయంపై దాడి తగదు

పాన్‌గల్: ఎమ్మెల్సీ ‘తీన్మార్’ మల్లన్న క్యూ న్యూస్ కార్యాలయంపై జాగృతి కార్యకర్తలు దాడి చేయడాన్ని నిరసిస్తూ బీసీ సంఘం, ఎమ్మార్పీ ఆధ్వర్యంలో బుధవారం మండలకేంద్రంలో అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి సుబ్బయ్యయాదవ్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు గంధం లక్ష్మయ్య మాట్లాడుతూ... ప్రజాస్వామ్యంలో ఇలాంటి దాడులు సరికాదన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేశాకే స్థానిక ఎన్నికలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల వలయంలో ఎస్సీ హాస్టల్



బురదమయంగా హాస్టల్‌కు వెళ్లే దారి(ఫైల్)

- పొలాల సమీపంలో భవనంతో ఇబ్బందులు
- ప్రహరీ లేక విషసర్పాలతో భయం భయం
- హాస్టల్‌కు వెళ్లే దారి బురదమయం
- సమస్యలపై దృష్టి సారించాలి

పాన్‌గల్: పేద విద్యార్థులు చదువుకుంటున్న ఎస్సీ బాలుర వసతి గృహంలో సమస్యలు పరిష్కారం కాక ఎన్నో సంవత్సరాలుగా విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. సమస్యలను పరిష్కరించాలని పాలకులకు, అధికారులకు విన్నవించినా పరిష్కరించక పోవడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. క్షేత్రస్థాయిలో హాస్టల్‌లో పడుతున్న ఇబ్బందుల పరిష్కారంపై అధికారులు దృష్టి సారించాలని విద్యార్థులు కోరుతున్నారు.

సమస్యలు ఇలా..

మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌లో వివిధ గ్రామాలకు చెందిన 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు దాదాపుగా 70 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వసతిగృహ భవనం వ్యవసాయ పొలాల సమీపంలో ఉండడంతో ఒక పక్క ప్రహరీ గోడ లేకపోవడంతో ఆవరణలోకి విషసర్పాలు, పందులు, ఇతర జంతువులు సంచరిస్తున్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ప్రహరీ గోడ, డైనింగ్‌హాల్, గదుల కిటికీలకు సరైన జాలీలు లేకపోవడం, హాస్టల్‌కు వచ్చే దారి మట్టిరోడ్డు కావడంతో వర్షాకాలంలో బురదమయంగా మారుతోంది. డ్రైనేజీ నీరు వెళ్లేందుకు సరైన పైపులైన్ ఏర్పాటు చేయకపోవడం, వాచ్‌మెన్ పోస్టుఖాళీ వంటి సమస్యలు హాస్టల్‌లో నెలకొన్నాయి. ముఖ్యంగా కిటికీలకు జాలీలు లేకపోవడంతో కోతుల బెడద ఎక్కువై కిటికీలు తెరవాలంటేనే భయంగా ఉంటుందని విద్యార్థులు వాపోతున్నారు.

త్వరిత గతిన పరిష్కరించాలి



పేద విద్యార్థులు చదువుకుంటున్న హాస్టల్‌లో సమస్యల పరిష్కారంపై అధికారులు దృష్టి సారించాలి. పొలాల సమీపంలో ఉండటంతో అవరణలోకి విషసర్పాలు, ఇతర జంతువులు వస్తున్నాయి. డైనింగ్‌హాల్ , డ్రైనేజీవ్యవస్థ, కిటికీలకు జాలీలు, హాస్టల్‌కు వచ్చే దారి వంటి సమస్యల పరిష్కారం కోసం తగుచర్యలు తీసుకోవాలి, లేనిచో విద్యార్థులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతాం.

– సూర్యవంశరాము, సీఐటీయూ నాయకుడు, పాన్‌గల్

అసంపూర్తి ప్రహరీ నిర్మించాలి



హాస్టల్ భవనం వ్యవసాయ పొలాల సమీపంలో ఉండటంతో విషసర్పాల బెడద ఉన్నది. అసంపూర్తిగా ఉన్న ప్రహరీ గోడ నిర్మించాలి. హాస్టల్ వచ్చే దారికి మరమ్మతులు చేపట్టాలి.

– నందకుమార్, 10వ తరగతి, హాస్టల్ విద్యార్థి

జిల్లా అధికారులకు సమస్యలు వివరించాం



హాస్టల్‌లో నెలకొన్న సమస్యలను జిల్లా అధికారులకు నివేదించాం. మరోమారు ఆయా సమస్యలను జిల్లా అధికారులకు తెలిపి వాటి పరిష్కారానికి ప్రయత్నిస్తాం.విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– ఆంజనేయులు, వార్డెన్

‘ఏక్ పేడ్ మా కే నామ్’తో పర్యావరణం పదిలం



మొక్క నాటుతున్న మున్సిపల్ కమిషనర్

వనపర్తిటౌన్: ‘ఏక్ పేడ్ మా కే నామ్’తో పర్యావరణం పదిలంగా ఉంటుందని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలిని అందించేవారవుతారని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు అన్నారు. ఈ మేరకు బుధవారం జిల్లా కేంద్రంలోని చందాపూర్ రోడ్డులో మై భారత్ కేంద్రం ఆధ్వర్యంలో తల్లి పేరు మీద మొక్కలు నాటే కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులతో కలిసి మొక్కలు నాటి మాట్లాడారు.. భవిష్యత్ తరాలకు ఆస్తులు ఇవ్వకపోయిన పర్వాలేదని, స్వచ్ఛమైన గాలిని అందిస్తే అదే కోట్ల ఆస్తి అని చెప్పారు. నాటిన ప్రతి మొక్క పేరు తమ తమ తల్లి పేరు పెట్టుకొని నాటిన ప్రతి మొక్కను మంచిగా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమా మహేశ్వర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమలేశు, నారాయణ, ప్రిన్సిపాల్ భయందర్, లోకేష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీల విధానం రద్దుచేసి కార్పొరేషన్ తీసుకురావాలి



కార్మికులతో మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి

వనపర్తి రూరల్: ఏజెన్సీల విధానం రద్దు చేసి, కార్పోరేషన్ వ్యవస్థ తీసుకొచ్చి కనీస వేతన జీవోలకు గెజిట్ చేయాలని మెడికల్ ఒప్పంద కార్మికుల యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి సురేష్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా మెడికల్ కళాశాల పారిశుద్ధ్య, సెక్యూరిటీ సూపర్‌వైజర్ కార్మికుల ఉమ్మడి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్య విద్యాబోధన, జనరల్ ఆసుపత్రుల కింద పనిచేస్తున్న పారిశుద్ధ్య సెక్యూరిటీ పేషేంట్ కేర్ సూపర్‌వైజర్‌కు వేతనాలు అందించే ఏజెన్సీల మూడేళ్ల కాల పరిమితి ముగుస్తుందని, రద్దుచేసి ఐహెచ్ఎఫ్ఎంఎస్ ద్వారా నూతన టెండర్ల ప్రక్రియ ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఒప్పంద కార్మికుల వేతనాల చెల్లింపులో ప్రభుత్వం తీవ్రమైన అలసత్వం ప్రదర్శిస్తుందని, దీని ఫలితంగా నెలల తరబడి వేతనాలు రాక అప్పుల ఊబిలోకి వెళ్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వమైన కాలయాపన చేయకుండా తక్షణమే కనీస వేతన జీవోలకు గెజిట్‌చేసి 26వేలకు వేతనాలు పెంచాలన్నారు. లేనిచో అందోళనలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్మికులు వరుణ్ , నరేష్, మన్నెమ్మ, సైదాబేగం, లావణ్య, లక్ష్మి, బొజ్జమ్మ, చెన్నమ్మ, శ్రీదేవి, లత తదితరులు పాల్గొన్నారు.

జీపీ పురస్కారాలకు పోటీ పడాలి



మాట్లాడుతున్న డిప్యూటీ సీఈఓ రాంమహేశ్వర్‌రెడ్డి

పాన్‌గల్: కేంద్ర ప్రభుత్వం అందించే జాతీయ పంచాయతీరాజ్ అవార్డులకు ప్రతి గ్రామపంచాయతీ పోటీ పడాలని డిప్యూటీ సీఈఓ రాంమహేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు పంచాయతీ అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్ 2023–24లో సాధించిన ప్రగతి అవార్డులకు సంబంధించిన తొమ్మిది ఇతివృత్తాలు.. వాటిని ఏ విధంగా పూర్తి చేయాలనే వాటిపై అవగాహన కల్పించారు. పేదరికం లేని మెరుగైన జీవనోపాధి, ఆరోగ్య, ఫ్రెండ్లీ, సరిపడా నీరు, క్లీన్ అండ్ గ్రీన్, సురక్షిత, ఆర్థిక స్వావలంబన, సమానమైన, న్యాయమైన అంశాలను పరిశీలించి అవార్డులు అందిస్తారన్నారు. ప్రథమ ర్యాంక్ సాధించిన గ్రామానికి రూ.కోటి, ద్వితీయ ర్యాంక్ సాధిస్తే రూ.75 లక్షలు, తృతీయ ర్యాంకు గ్రామానికి రూ.50 లక్షలు ఆర్థిక ప్రోత్సాహకం చెల్లిస్తారని వివరించారు. సమావేశంలో తహసీల్దార్ అబ్రహం లింకన్, ఎంపీడీఓ గోవిందరావు, పీహెచ్‌సీ వైద్యుడు డా. చంద్రశేఖర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షాహీన్ బేగం, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

జీపీ అవార్డుల నివేదిక ఇవ్వాలి

అమరచింత: ఉత్తమ పంచాయతీలకు ఎంపిక చేసేందుకు ఆయా శాఖల అధికారులు పూర్తిస్థాయిలో నివేదికలు ఇవ్వాలని ఎంపీడీఓ శ్రీరాంరెడ్డి కోరారు. ఎంపీడీఓ సమావేశ మందిరంలో బుధవారం అధికారుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామస్థాయిలో జరిగే ఉపాధి పనులు, తాగునీటి సరఫరా, పరిసరాల పరిశుభ్రత, విద్యాబోధన, అంగన్‌వాడీల పనితీరు, పోలీసు క్రైం రేటు, వైద్యసేవలతో పాటు ఇతర కార్యక్రమాలు ఎలా అమలవుతున్నాయనే విషయాలపై నివేదికను సేకరించి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ అరుణ, ఎంపీఓ నరసింహులు, మిషన్ భగీరథ ఏఈ రుక్మేందర్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించాలి



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర సభ్యుడు పుట్ట ఆంజనేయులు

వనపర్తి రూరల్: అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, మధ్యాహ్న భోజనం కార్మికులు, ఐకేపీ, వీవోఏ ఆర్పీ తదితర రంగాలకు చెందిన స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించాలని సీఐటీయూ రాష్ట్ర సభ్యుడు పుట్ట ఆంజనేయులు డిమాండ్ చేశారు. బుధవారం పెబ్బేరు పట్టణంలోని విలేకరులతో మాట్లాడారు. పెబ్బేరులో నిర్వహించిన 4వ జిల్లా మహాసభలను విజయవంతం చేసిన కార్మికులందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. 9 అంశాలపై తీర్మానాలు చేసి ఆమోదించినట్లు ఆయన తెలిపారు. కనీస వేతనాలు అన్ని రంగాల కార్మికులకు రూ.26 వేలు ఇవ్వాలని, ఏబీడీ కంపెనీలో పనిచేస్తున్న హమాలీలకు పాత పేరుపైనే కొనసాగిస్తున్నారని, జిల్లా లేబర్ అధికారులకు దరఖాస్తు చేసుకుంటే ఆ కంపెనీకి అమ్ముడుపోయి పేరును మార్చడం లేదని వాపోయారు.

సీఐటీయూ జిల్లా కమిటీ ఎన్నిక

మహసభల్లో రాష్ట్ర అధ్యక్ష , కార్యదర్శుల సమక్షంలో సీఐటీయూ జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఆర్ఎన్ రమేశ్, కార్యదర్శిగా మండ్లరాజు, ఉపాధ్యక్షులుగా ఎండీ మహిమూద్, పుట్ట ఆంజనేయులు, కె.సునీత, శారద, రాజు, సహాయ కార్యదర్శులు గంధం సుమన్, బుచ్చమ్మ, రాము, కవిత, బాలగౌడ్, వారితో పాటు 23 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండ్ల రాజు, రమేశ్, బొబ్బిలి నిక్సన్, ఊశన్న తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన ఎంఈఎఫ్ నాయకులు

వనపర్తి విద్యావిభాగం: రాష్ట్ర షెడ్యూల్ కులాల, అభివృద్ధి, గిరిజన, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను బుధవారం ఎంఈఎఫ్ నాయకులు హైదరాబాద్‌లోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో కలిసి బొకేను ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రికి పలు సమస్యలను వివరించినట్లు తెలిపారు. కలిసిన వారిలో ఉద్యోగుల సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షుడు గద్వాల కృష్ణ, ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటయ్య, గొర్ల బలరాం, కేశవులు, ఉషోదయ, శుభోదయ తదితరులు ఉన్నారు.

ప్రిన్సిపాల్‌కు డాక్టరేట్

వనపర్తి విద్యావిభాగం: ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న ఈశ్వరయ్య కామర్స్ విభాగంలో స్వామి రామానంద తీర్థ మరాఠ్వాడ యూనివర్సిటీ నాందేడ్ నుంచి డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. పీహెచ్‌డీని పూర్తి చేసినందుకు బోధనేతర సిబ్బంది, విద్యార్థులు సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రామరాజుయాదవ్, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.దామోదర్‌రెడ్డి, స్టాఫ్‌క్లబ్ కన్వీనర్ రూపలక్ష్మి, మంజుల, శ్రీనివాస్, స్వామి, స్రవంతి, విష్ణుమూర్తి, మన్యం తదితరులు ఉన్నారు.

కస్తూర్బాలో సమస్యలు పరిష్కరించాలి

కొత్తకోట రూరల్: జిల్లాలోని కస్తూర్బాగాంధీ, గురుకుల పాఠశాలలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని బీసీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చెన్నరాములు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఎస్సీ బాలికల గురుకుల పాఠశాల, అమడబాకుల గ్రామంలో కేజీబీవీ పాఠశాలను ఆయన సందర్శించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో పాఠశాల మైదానం లెవెలింగ్ సరిగ్గా లేనందున ఆటలు ఆడేందుకు ఇబ్బందిగా ఉందన్నారు. వెంటనే లెవెలింగ్ చేసేందుకు జిల్లా విద్యాధికారులకు దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఆయన వెంట బీసీఎఫ్ జిల్లా నాయకులు తదితరులు ఉన్నారు.

పుర కార్మికులు ఆరోగ్యంగా ఉండాలి

ఆత్మకూర్: పురపాలికలో పనిచేస్తున్న కార్మికులు ఆరోగ్యంగా ఉండాలని అనారోగ్యాలకు గురికాకుండా పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ శశిధర్ అన్నారు. బుధవారం స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో అధికారులు, కార్మికులతో సమావేశమయ్యారు. నేషనల్ యాక్షన్ ఫర్ మెకానైజ్డ్ శానిటేషన్ ఏకోసిస్టం పథకంలో భాగంగా పారిశుద్ధ్య కార్మికులకు పీపీఈ కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్‌ఎడ్యూకేటర్ సురేందర్‌గౌడ్, అధికారులు ఝాన్సీరెడ్డి, అనూష, మోహన్, కాషన్న, ముబ్బషీర్ ఉన్నారు.

వీధి విక్రయదారుల సామాజిక ఆర్థికసర్వే

అమరచింత: మున్సిపాలిటీలో బ్యాంకు ద్వారా రుణం పొంది వీధి విక్రయదారులుగా వ్యాపారం సాగిస్తున్న వారిని కలిసి సామాజిక ఆర్థిక సర్వే చేపడుతున్నామని మెప్మా కో ఆర్డినేటర్ యువరాజు తెలిపారు. పురపాలిక కార్యాలయంలో బుధవారం వీధి విక్రయ రుణాలను పొందిన వారి కుటుంబసభ్యుల సమాచారంతో పాటు ఆర్థికసర్వే నిర్వహించినట్లు వెల్లడించారు. ప్రభుత్వ ఆదేశాలతో విక్రయదారుడి సమాచారం ఆన్‌లైన్‌లో నమో దు చేస్తున్నామన్నారు. రుణం తీసుకుని ప్రమాదవశాత్తు విక్రయదారుడు మృతి చెందితే వారి వ్యాపా రం కుంటుపడకుండా ఆదుకోనే అవకాశం ఉందన్నారు. అదే విధంగా ఏడాదికి రూ.456 వ్యక్తిగతంగా స్ట్రీట్ వెండర్ పేరిట పీఎం బీమా సురక్ష, జీవన్‌జ్యోతి పథకాలు ఆపదకర సమయాల్లో రూ.2లక్షల బీమా వస్తుందన్నారు. పట్టణంలో మొత్తం 632మంది రుణాలను పొందారని మొదటిరోజు 105 మందిని కలిసి వివరాలను నమోదు చేశామన్నారు. కార్యక్రమంలో ఆర్పీలు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో పురపాలికలు అభివృద్ధి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

వనపర్తి రూరల్: పెబ్బేరు మున్సిపాలిటీ అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తున్నట్లు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. బుధవారం మున్సిపల్ కేంద్రంలో కొత్తగా నిర్మించుకున్న 30 పడకల ఆసుపత్రి నిర్మాణానికి ఇటీవల ప్రమాదవశాత్తు కాలిపోయిన వ్యవసాయ మార్కెట్ యార్డు గోదాంతో పాటు మరో నూతన గోదాంకు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెబ్బేరులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రూ 11.26 లక్షల వ్యయంతో 6 పడకల నుంచి 30 పడకల ఆసుపత్రిగా నిర్మించినట్లు ఆయన పేర్కొన్నారు. అగ్ని ప్రమాదంలో దగ్ధమైన గోదాం భవన నిర్మాణంతో పాటు మరో 5 వేల మెట్రిక్‌టన్నుల గోదాం నిర్మాణానికి దాదాపు రూ.8కోట్ల మంజూరు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ గొని ప్రమోదినిరెడ్డి, వైస్‌చైర్మన్ విజయవర్ధన్‌రెడ్డి, డీఎంఎచ్ఓ శ్రీనివాసులు, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు వెంట్రాములు ,నాయకులు సురెందర్‌గౌడ్, రంజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ అధికారులపై ఆగ్రహం

పెబ్బేరు పురపాలిక కార్యాలయంలో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మున్సిపల్ అధికారులతో సమీక్ష సమాశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెబ్బేరు –వనపర్తి రోడ్డు విస్తరణలో భాగంగా ఇళ్లు కోల్పోయిన బాధితు వివరాలపై మేనేజర్ గణేశ్‌బాబును వివరాలు అడగడంతో సరైన సమాధానం ఇవ్వకుండా దాటవేత సమాధానాలు చెప్పడంతో ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 84 మంది బాధితులకు న్యాయం చేయాల్సి ఉండగా ఇప్పటిదాక ఏ కొలతలతో ప్లాట్లు కేటాయించాలనే దానిపై కూడా అవగాహన కనబడకపోవడంతో ఎమ్మెల్యే అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలో వివిధ ప్రాంతాల్లో వేయాల్సిన రోడ్లకు నాలుగు నెలల కిందటే ప్రపోజల్స్ వచ్చి ఎస్టిమేషన్లు తయారైనా కాంట్రాక్టర్లు పనులు చేయడం లేదని, ఈ విషయం ఎమ్మెల్యేకు సమాచారం ఇవ్వక పోవడంతో ఏఈ చంద్రశేఖర్‌ను మందలించారు. పాతజాడ్యం వదలక పోతే అధికారులపై సీరియస్ యాక్షన్ ఉంటుందని హెచ్చరించారు. ఇప్పటికైన నిద్రమత్తు వదులుకొని అభివృద్ధిపై దృష్టి సారించాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్‌చైర్మన్ ప్రమోదిని, వైస్ చైర్మన్ విజయవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి

- కలెక్టర్ ఆదర్శ్ సురభి



టీకాలు వేస్తున్న తీరును పరిశీస్తున్న కలెక్టర్ ఆదర్శ్‌సురభి

వనపర్తి రూరల్: చిన్నపిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు క్రమం తప్పకుండా వేయించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. బుధవారం ఆయన శ్రీరంగాపురంలో ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు టీకాలు వేస్తున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీకాల సమాచారం ఎప్పటికప్పుడు చేరవేయాలని సూచించారు. వందశాతం పిల్లలకు టీకాలు వేయాలని, వారి సమాచారం అంతర్జాలంలో నమోదు చేయాలని, డయాబెటిక్ పరీక్షలు నిర్వహించి మందులు ఇవ్వాలన్నారు. అనంతరం ఆయన జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించి కంప్యూటర్ ల్యాబ్‌ను తనిఖీ చేశారు. పిల్లలకు పాఠశాల దశనుంచే కంప్యూటర్ విద్యపై పట్టు సాధించేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశపెట్టిన కృత్రిమమేధస్సు(ఏఐ) శిక్షణ కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించాలని కలెక్టర్ అన్నారు. కంప్యూటర్ శిక్షణ ఇస్తున్న అన్ని పాఠశాలల్లో ఇంటర్‌నెట్ సమస్య లేకుండా నాణ్యమైన కనెక్షన్ తీసుకోవాలని, విద్యార్థులు కృత్రిమ మేధస్సు శిక్షణ తీసుకునేటప్పుడు హెడ్‌సెట్ తప్పకుండా వాడాలన్నారు. ప్రతివిద్యార్థికి యుజర్ ఐడీ ఎవరి ఐడీ వారు వాడేవిధంగా చూడాలన్నారు. అనంతరం కలెక్టర్ పదో తరగతి విద్యార్థులకు గణిత ప్రశ్నలను సంధించి సమాధానాలు రాబట్టారు. గణితంలో మంచిపట్టు సాధించే దిశగా బోధించాలని, ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ టీటీ ప్రోగాం ఆఫీసర్ సాయినాథ్‌రెడ్డి వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ దరఖాస్తులను పరిష్కరించాలి

వనపర్తి: భూ భారతి చట్టం ద్వారా రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించడంలో వేగం పెంచాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి తహసీల్దార్లను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ సమావేశ మందిరంలో తహసీల్దార్లకు, డిప్యూటీ తహసీల్దార్లకు, ఆర్ఐలకు, కంప్యూటర్ ఆపరేటర్లతో రెవెన్యూ దరఖాస్తుల పరిష్కారంపై సమీక్ష నిర్వహించారు. మండలాల వారీగా దరఖాస్తుల పరిష్కారంపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. భూ భారతి చట్టం ప్రకారం రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించడంలో వేగం పెంచాలని ఆదేశించారు. ఆగస్టు 15 నాటికి ఏ ఒక్క దరఖాస్తు పెండింగ్ లేకుండా చూసుకోవాలన్నారు. అందువల్ల వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకొని అవసరమైన వారికి వెంటనే నోటీసులు పంపించాలని సూచించారు. చాలా దరఖాస్తులు తహసీల్దార్ లాగిన్ లోనే పరిష్కరించవచ్చని వాటిని త్వరగా పరిష్కరించాలని సూచించారు. ఆర్డీఓ లాగిన్‌కు పంపించాల్సింది ఆర్డీఓకు మిగిలినవి కలెక్టర్ లాగిన్‌కు పంపించాలన్నారు. సమావేశంలో ఆర్డీవో సుబ్రహ్మణ్యం, తాసిల్దార్లు, డిటీలు, ఆర్ఐ, ఆపరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

దేవరకద్ర మార్కెట్‌కు రాయచూర్ ఉల్లి



దేవరకద్ర మార్కెట్‌కు అమ్మకానికి వచ్చిన రాయచూర్ ఉల్లి

దేవరకద్ర: దేవరకద్ర మార్కెట్‌కు ఉల్లి కొరత ఏర్పడడంతో పలువురు వ్యాపారులు రాయచూర్ నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి జూన్ మొదటి వారం వరకు ఉల్లి సీజన్ కొనసాగింది. ప్రతివారం వేలాది బస్తాల ఉల్లి అమ్మకానికి వచ్చేది. దీంతో ఉల్లి కొరత ఏర్పడలేదు. నాలుగు వారాలుగా మార్కెట్‌కు ఉల్లి రావడం తగ్గిపోయింది. రైతులు ఇప్పటికే ఉన్న ఉల్లినంతా అమ్ముకోవడంతో అక్కడక్కడా దాచుకున్న రైతులు మాత్రమే అమ్మకానికి తెస్తున్నారు. ఉల్లి కొరతను దృష్టిలో పెట్టుకుని కొందరు వ్యాపారులు రాయచూర్ నుంచి కొనుగోలు చేసిన ఉల్లిని దేవరకద్ర మార్కెట్‌కు తరలించి వేలంలో పెట్టి విక్రయాలు సాగించారు. బుధవారం జరిగిన వేలంలో నాణ్యమైన ఉల్లికి గరిష్టంగా రూ.2,050, కనిష్టంగా రూ.1400 ధర పలికింది. చిన్నసైజు పాత ఉల్లికి గరిష్టంగా రూ.1,200, కనిష్టంగా రూ.700 వరకు ధరలు పలికాయి. రాయచూర్ నుంచి రూ.వెయ్యికి క్వింటా తెచ్చిన ఉల్లికి వేలం వేయగా రూ.1400 వరకు ధర వచ్చింది.

ర్యాగింగ్ చేస్తే చర్యలు తప్పవు



వనపర్తిటౌన్: కళాశాల్లో చేరే కొత్త విద్యార్థులతో సీనియర్లు ర్యాగింగ్ చేయడం నేరమని జిల్లా న్యాయసేవాధికార కార్యదర్శి రజిని అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని శ్రీవాణి డిగ్రీ కళాశాలలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కొత్తగా చేరిన విద్యార్థులను సీనియర్ల ర్యాగింగ్‌కు అనర్థాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. విద్యార్థులు తమ ఉన్నతమైన భవిష్యత్ నిర్మాణం కోసం లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని, వాటి సాధనకై కృషి చేయాలని సూచించారు. మోటార్ వెహికల్ యాక్ట్, పోక్సో యాక్ట్, ఉచిత న్యాయ సేవలను వివరించారు. న్యాయ సలహాల కోసం టోల్‌ఫ్రీ నంబర్ 15100 సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాది కృష్ణయ్య, అధ్యాపకులు విమల, రమ్యకృష్ణ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ విద్యార్థికి సన్మానం

ఖిల్లాఘనపురం: ప్రతివిద్యార్థి ఉన్నతంగా ఎదిడినప్పుడే కన్నతల్లిదండ్రులకు, విద్యనేర్పిన గురువులకు ఆనందం కలుగుతుందని మామిడిమాడ ఉన్నత పాఠశాల హెచ్ఎం చెన్న అన్నారు. మంగళవారం విడుదలైన బాసర ట్రిపుల్ ఐటీ సీట్ల రెండో జాబితాలో మామిడిమాడ ఉన్నత పాఠశాల విద్యార్థి అరుణ్ అర్హత సాధించాడు. ఈ సందర్భంగా బుధవారం అరుణ్‌కు ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

మద్యం తాగొద్దు

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని మోజర్ల గ్రామంలో ఉద్యాన కళాశాల విద్యార్థులు నిర్వహిస్తున్న జాతీయసేవా పథక ప్రత్యేక శిబిరంలో ఆరోరోజు ఉద్యాన కళాశాల విద్యార్థులు ఎన్ఎస్ఎస్ అధికారి భాస్కర్ అధ్వర్యంలో గ్రామ పంచాయతీ ఆవరణలో మద్యం తాగితే వచ్చే నష్టాలను వివరించారు. ఈ కార్యక్రమంలో 26 మంది హార్టికల్చర్ విద్యార్థులు గ్రామస్తులు పాల్గొన్నారు.

అక్రమాలపై రాజీలేని పోరాటం

వనపర్తిటౌన్: సామాజిక న్యాయ సంఘం జిల్లా చైర్మన్‌గా నియమించిన చిలుక సత్యంసాగర్‌ను బుధవారం బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌సాగర్ సన్మానించారు. సమాజంలో అన్యాయాలు, అక్రమాల పై స్పందించేందుకు రాజీలేని పోరాటం చేసే యోచనలో భాగంగా సామాజిక న్యాయసంఘం పని చేస్తుందని శ్రీనివాస్ తెలిపారు.న్యాయం పక్షాన ప్రజలవైపు నిలబడేందుకు సత్యంసాగర్‌ను రాష్ట్రకమిటీ నియమించినట్లు వెల్లడించారు.